సీసీ రోడ్డు పనులు ప్రారంభం

అల్లాదుర్గం, ఫిబ్రవరి 27 : మండలంలోని ముస్లాపూర్‌లో సీసీ రోడ్డు పనులను మంగళవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శేషారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధి మంత్రి దామోదర రాజనర్సింహ అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఇందులో భాగంగా ముస్లాపూర్ గ్రామానికి ఎన్ఆర్ఈజీఎస్ కోటాలో రూ. 10 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బలరాం, సురేశ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

లారీ బోల్తా.. డ్రైవర్ మృతి

అల్లాదుర్గం, ఫిబ్రవరి 27 : అతి వేగంగా వెళ్తున్న లారీ అదుపుతప్పి బోల్తా పడడంతో డ్రైవర్ మృతి చెందిన ఘటన అల్లాదుర్గం మండలంలోని కాయిదంపల్లి గ్రామ శివారులో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాలు.. హైదరాబాద్ నుంచి గుజరాత్‌కు అయిల్ ట్యాంకర్‌తో వెళ్తున్న లారీ.. కాయిదంపల్లి గ్రామ శివారు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో లారీ డ్రైవర్ కర్నె రాం(24) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు రాజస్థాన్‌లోని బర్మార్ జిల్లా వాసిగా పోలీసులు గుర్తించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్‌రెడ్డి తెలిపారు.

డీఎస్సీ వాయిదా వేయాలని ధర్నా

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 27 : డీఎస్సీ నిర్వహించే ముందు ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) నిర్వహించాలని డిమాండ్ చేస్తూ బుధవారం కలెక్టరేట్ ఎదుట ఛాత్రోపాధ్యాయులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... 2022లో కరోనా నేపథ్యంలో బీఈడీ, డైట్ కళాశాలల్లో ఆలస్యంగా ప్రవేశాలు నిర్వహించారని, ఫలితంగా తరగతులు ఆలస్యంగా ప్రారంభం కావడంతో విద్యా సంవత్సరం నష్టపోతాయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీని వాయిదా వేయాలని చాత్రోపాధ్యాయులు డిమాండ్ చేశారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

టేక్మాల్, ఫిబ్రవరి 27 : పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని, అందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో నీలకంఠం సూచించారు. కుసంగి, ఎలకుర్తి, ధనూర గ్రామాల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో నీలకంఠం విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యార్థులు భయభ్రాంతులకు గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసి వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. ఎంఈవో వెంట ప్రధానోపాధ్యాయులు విశ్వనాథం, వసంత, గోవర్ధన్, ఉపాధ్యాయులుఉన్నారు.

విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

చిలిపిచెడ్, ఫిబ్రవరి 27 : మండలంలోని బండపోతుగల్ గ్రామంలో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు మంగళవారం భూమి పూజ చేశారు. అంబేద్కర్ యూత్ సభ్యులు, మాజీ సర్పంచ్ ఇస్తారి అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆరు నెలలలోపు అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ పోచయ్య, నాయకులు దేవయ్య, శ్రీను, పోచయ్య, రాములు, సత్తయ్య, రవి పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి

చిలిపిచెడ్, ఫిబ్రవరి 27 : విద్యార్థులు క్రీడా రంగంలో రాణించాలని ప్రధానోపాధ్యాయులు సోమకృష్ణ, హరిసింగ్, నాగరాజు అన్నారు. నర్సాపూర్‌లో ఎస్‌బీఆర్ నేషనల్ ఓపెన్ కుంగ్‌ఫూ అండ్ కరాటే పోటీల్లో చిట్కుల్, చండూర్, గౌతాపూర్ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు ఉపాధ్యాయులు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేసి అభినందించారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్లు మురళి, షాదుల్లా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి

- నార్సింగి, చిన్నాఘన్‌పూర్‌లో రేణుకాఎల్లమ్మ ఆలయాల్లో కల్యణోత్సవాలు
- హాజరైన దుబ్బాక, నర్సాపూర్ ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి

నార్సింగి మండలకేంద్రంలోని రేణుకాఎల్లమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

చేగుంట/ కొల్చారం/ శివ్వంపేట, ఫిబ్రవరి 27 : నార్సింగి మండలకేంద్రంలోని రేణుకాఎల్లమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. గౌడ సంఘం, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం రేణుకాఎల్లమ్మ కల్యాణోత్సవం, అన్నదానం కార్యక్రమాలు నిర్వహించారు. కల్యాణోత్సవంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, అన్నదానాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డిని ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. ఉత్సవాల్లో బీఆర్ఎస్ నార్సింగి మండలాధ్యక్షుడు మైలరాం బాబు, జడ్పీటీసీ కృష్ణారెడ్డి, ఎంపీటీసీ సుజాతామల్లేశంగౌడ్, సొసైటీ చైర్మన్ శంకర్‌గౌడ్, మాజీ ఎంపీపీ పండరిగౌడ్, మాజీ సర్పంచ్‌లు అశోక్‌గుప్తా, రాజాగౌడ్, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

సంతోషంగా ఉండాలి : ఎమ్మెల్యే సునీతారెడ్డి

కొల్చారం మండలం చిన్నాఘన్‌పూర్ ఐబీ ప్రాంతంలోని రేణుకాఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు గౌడ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. రాంపూర్‌లో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ తల్లి కల్యాణోత్సవం నిర్వహించారు. ఉత్సవాలకు ఎమ్మెల్యే సునీతారెడ్డి హాజరై, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవార్ల దయతో ప్రజలంతా సంతోషంగా ఉండాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. ఎమ్మెల్యే వెంట జడ్పీటీసీ మేఘమాల, ఎంపీపీ మంజుల, సీడీసీ మాజీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, గౌడ సంఘం మండలాధ్యక్షుడు వెంకట్‌గౌడ్, సొసైటీ వైస్‌చైర్మన్ రాజాగౌడ్, నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు నర్సింహులు, శేఖర్, యాదయ్య, సిద్ధిరాములు, చిన్నాఘన్‌పూర్ ఉపసర్పంచ్ లక్ష్మీనారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

కలెక్టర్ రాజర్షి షా

మెదక్, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ) : రానున్న లోక్‌సభ ఎన్నికల్లో నోడల్ అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం ఈఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ, వీవీటీ, అకౌంటింగ్ టీం, నోడల్ ఆఫీసర్లకు శిక్షణ కార్యక్రమాన్ని మాస్టర్ ట్రైనర్, తూప్రాన్ ఆర్డీవో జయచందర్‌రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. నోడల్ అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వహించాలన్నారు. సెక్టోరల్ ఆఫీసర్లకు శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఈవీఎం కమిషనింగ్, పోస్టల్ బ్యాలెట్ నిర్వహణ, పోస్టల్ బ్యాలెట్ హోమ్ ఓటింగ్, ఈవీఎం మేనేజ్‌మెంట్ ర్యాండమైజేషన్ పోలింగ్ పర్సన్స్ డేటా ఎంట్రీ సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. నామినేషన్, డేటా ఎంట్రీ, అసెంబ్లీ సెగ్మెంట్ల నుంచి డైలీ రిపోర్టు, ఓటర్ హెల్ప్ లైన్‌పై సుదీర్ఘంగా వివరించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ, వీవీటీ, ఎంసీసీ టీమ్‌లు కలిసి పనిచేయాలని ఆదేశించారు. ఎన్నికల్లో నగదు పట్టుబడితే పాటించాల్సిన నిబంధనలతోపాటు సీ-విజిల్‌లో వచ్చే ఫిర్యాదుల పరిష్కారాలను వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, అదనపు ఎస్పీ మహేందర్, తహసీల్దార్లు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

ప్రజల పక్షాన ఉండి కొట్లాడేది బీజేపీ

మాట్లాడుతున్న మాజీ మంత్రి ఈటల రాజేందర్

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 27 : బీజేపీ ప్రజల పక్షాన ఉండి కొట్లాడే పార్టీ అని మాజీ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని రాందాస్ చౌరస్తాలో బీజేపీ విజయ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మాజీ సీఎం కేసీఆర్ లక్ష రూపాయల రుణమాఫీ చేయలేదని.. సీఎం రేవంత్‌రెడ్డి రూ.2 లక్షల రుణమాఫీ ఎలా చేస్తారని? అని ప్రశ్నించారు. రుణమాఫీపై కాంగ్రెస్ ప్రభుత్వం బహిరంగ చర్చకు రావాలని సవాల్ చేశారు. విజయ సంకల్పయాత్రలో రాణిరుద్రమదేవి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కేసీఆర్ ప్రభుత్వంలోనే అంగన్‌వాడీలకు న్యాయం

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్‌లో అంగన్‌వాడీ టీచర్‌కు చీరలను అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్, ఫిబ్రవరి 27 : అంగన్‌వాడీ వర్కర్లు గ్రామాల్లో చేస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం నర్సాపూర్ పట్టణంలోని రైతువేదికలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం అంగన్‌వాడీ వర్కర్లకు అండగా ఉంటూ న్యాయం చేసిందని గుర్తుచేశారు. ఒక మహిళ గర్భిణి అయినప్పటి నుంచి ప్రసవం అయ్యే వరకు అంగన్‌వాడీ వర్కర్లు సేవలు అందిస్తున్నారని తెలిపారు. నర్సాపూర్ నియోజకవర్గంలో అంగన్‌వాడీ భవనాలను త్వరగా పూర్తి చేసేందుకు కృషి చేస్తానన్నారు. అంగన్‌వాడీ వర్కర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కిశోర బాలికల ఆరోగ్యంపై అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. సీడీపీవో హేమభార్గవి, మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ నయీమొద్దీన్, చిలిపిచెడ్ ఎంపీపీ వినోద, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకులు సత్యంగౌడ్, సూరారం నర్సింహులు, షేక్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ పంటల సాగు పెరగాలి

జిల్లా వ్యవసాయాధికారి గోవింద్

రైతులకు సూచనలు చేస్తున్న మెదక్ సహాయ వ్యవసాయసంచాలకులు విజయనిర్మాల

చిలిపిచెడ్/ మెదక్ రూరల్, ఫిబ్రవరి 27 : మెదక్ మండలం ర్యాలమడుగు గ్రామంలోని రైతు వేదికలో నేషనల్ వాటర్ మిషన్, జలశక్తి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో రైతులకు నీటి వనరుల సంరక్షణ, సేంద్రియ పంటల సాగుపై శిక్షణ ఇస్తున్నారు. నీరు, భూమి యాజమాన్య శిక్షణ పరిశోధన సంస్థ ప్రతినిధులు రెండోరోజు మంగళవారం వ్యవసాయ విస్తరణ అధికారులకు నీటి యాజమాన్య సంరక్షణపై రెండో రోజు శిక్షణ నిర్వహించారు. జిల్లా సేంద్రియ పంటలు, నేల, నీటి యాజమాన్య పద్ధతులపై వ్యవసాయాధికారి గోవింద్, కోఆర్డినేటర్ అన్నపూర్ణ అవగాహన కల్పించారు. శిక్షణ అనంతరం ఏఈవోలకు సర్టిఫికెట్ అందజేశారు. శిక్షణలో వివిధ గ్రామాలకు చెందిన ఏఈవోలు రాజశేఖర్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించాలి

రైతులు కొద్దిపాటి జాగ్రత్తలు పాటిస్తే వరి పంటలో మొగిపురుగును నివారించవచ్చని చిలిపిచెడ్ మండల వ్యవసాయాధికారి బాల్‌రెడ్డి సూచించారు. చిలిపిచెడ్ మండలంలోని బండపోతుగల్, ఫైజాబాద్, చండూర్ గ్రామాల్లో వరి పోలాలను మంగళవారం ఏఈవో భూపాల్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో బాల్‌రెడ్డి రైతులతో మాట్లాడారు. మొగిపురుగు సోకితే వరి పంట ఎండినట్లుగా కనిపిస్తాయన్నారు. రైతులు గుళికలు చల్లి మొగుపురుగును నివారించాలని సూచించారు. వాతావరణంలో వచ్చిన మార్పులపాటు గత యాసంగిలో వరి కొయ్యలు పూర్తిగా కుళ్లిపోక ముందే నాట్లు వేయడంతో మొగి పురుగు ఉధృతంగా సోకిందన్నారు. కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు ఎకరానికి 10 కిలోలు లేదా కాల్టాఫ్ హైడ్రోక్లోరైడ్ 50 ఏసీపీ 4జీ గుళికలు ఎకరానికి 8 కిలోలు లేదా క్లోరాన్‌ట్రానిప్రోల్ 0.4ఈసీ -4కిలోల గుళికలను ఇసుకలో కలిపి చల్లాలని సూచించారు. గుళికలను ఇతర మందులు లేదా యూరియాతో కలిపి చల్లవద్దని హెచ్చరించారు. వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు.

సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడి

మెదక్ రూరల్, ఫిబ్రవరి 27 : వరి పంటలో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని, తద్వారా అధిక దిగుబడి పొందాలని మెదక్ ఏడీఏ విజయనిర్మల సూచించారు. మంగళవారం మెదక్ మండలంలో పర్యటించి, వరి పంటలను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. రైతులు పంటల సంరక్షణకు వ్యవసాయాధికారులను సంప్రదించి, వారు సూచించిన మందులను పిచికారీ చేయాలన్నారు. వరి పంటలో మొగిపురుగు, తెల్లకంకి తెగుళ్ల నివారణకు కార్టప్ హైడ్రోక్లోరైడ్‌ను 400గ్రాముల మందును ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. అగ్గి, మెడవిరుపు తెగులునివారణకు ట్రైసైక్లోజోల్ 120గ్రాములు లేదా టెబ్యుకొనజోల్+ట్రైఫ్లాక్సిస్ట్రోబిన్ను 100గ్రాముల మిశ్రమ మందును ఎకారానికి 200లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని రైతులకు వివరించారు.

నిజాంపేటలో విజయ సంకల్ప యాత్ర

నిజాంపేట, ఫిబ్రవరి 27 : మండల కేంద్రం నిజాంపేటలో మంగళవారం బీజేపీ నాయకులు విజయ సంకల్ప యాత్ర నిర్వహించారు. కల్వకుంట గేట్ నుంచి నిజాంపేట బస్టాప్ వరకు బైక్ ర్యాలీ చేపట్టారు. సంకల్ప యాత్రకు ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణీరుద్రమ, మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి లక్ష్మీనర్సయ్య, జడ్పీటీసీ పంజా విజయ్‌కుమార్‌కు బీజేపీ కార్యకర్తలు గజమాల వేసి సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు సిద్ధిరాములు, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్, చంద్రశేఖర్, ప్రశాంత్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

పంచాయతీ సెక్రటరీపై విచారణ

నర్సాపూర్, ఫిబ్రవరి 26 : మండలంలోని అహ్మద్‌నగర్ గ్రామపంచాయతీ సెక్రటరీ సంతోష్‌కుమార్ అవినీతికి పాల్పడుతున్నాడనే ఫిర్యాదుతో సోమవారం ఎంపీవో వైద్య శ్రీనివాస్ విచారణ చేపట్టారు. కల్యాణలక్ష్మి, ఇంటి పన్ను వసూలు, ఇంటి నిర్మాణ అనుమతులపై పంచాయతీ కార్యదర్శి ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు స్థానిక వార్డు సభ్యులు రెండు నెలల క్రితం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల తో ఎంపీవో వైద్య శ్రీనివాస్ అహ్మద్‌నగర్ గ్రామంలో మంగళవారం పర్యటించి, విచారణ చేపట్టడం జరిగింది. వివిధ విషయాలపై ప్రశ్నించగా పంచాయతీ కార్యదర్శి సంతోష్ కుమార్ ఎలాంటి సమాధానాలు ఇవ్వలేదు. పూర్తి విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తానని ఎంపీవో వైద్య శ్రీనివాస్ తెలిపారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

రేగోడ్/ చిన్నశంకరంపేట/ పాపన్నపేట, ఫిబ్రవరి 27: రేగోడ్ మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు పెద్దతండాలో ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఖాజాపూర్,చందంపేట పాఠశాలల్లో విద్యార్థుల స్వయం పరిపాలన దినోత్సవం చిన్నశంకరంపేట మండలంలోని ఖాజాపూర్, చందంపేట ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థులు ఉపాధ్యాయులు మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. పాపన్నపేట మండలంలోని కొత్తపల్లి ఉన్నత పాఠశాల, అన్నారం ప్రాథమికోన్నత పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఖాజాపూర్ పాఠశాల హెచ్ఎం సురేందర్‌గౌడ్, అన్నారం పాఠశాల హెచ్ఎం బాలరాజు ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

'తపాలా' ఖాతా తీసుకోవాలి

పెద్దశంకరంపేట/ అల్లాదుర్గం, ఫిబ్రవరి 27 : తపాలా శాఖలో ప్రతి ఒక్కరూ ఖాతాదారులుగా చేరి, తపాలా శాఖ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సంగారెడ్డి డివిజన్ తపాలా శాఖ మెయిల్ ఓవర్సీస్ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం పెద్దశంకరంపేటలోని బ్రాంచ్ పోస్టాఫీస్, బూరుగుపల్లిలో ఐపీపీబీ లాగిన్ డే సందర్భంగా తపాలాశాఖ ఖాతాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. తపాలాశాఖలో జీవిత బీమా పీఎల్ఐ, ఆర్‌పీఎల్ఐ, పీపీఎఫ్, టీడీ తదితర పథకాలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తపాలాశాఖ ఖాతాదారులకు దేశవ్యాప్తంగా అన్ని సేవలు ఆన్‌లైన్‌లో కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. బీపీఎంలు ప్రశాంత్, మాణయ్య, గంగారాం, రాఘవేంధర్, తుకారాం, సుదర్శన్ పాల్గొన్నారు.

'పీఎం సూర్య ఘర్ విద్యుత్ యోజన' సద్వినియోగం చేసుకోవాలి

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 27 : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'పీఎం సూర్య ఘర్ విద్యుత్ యోజన' పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మెదక్ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీహరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత సౌర్య విద్యుత్ పొందానికి డాబా ఇల్లు ఉన్నవారు అర్హులన్నారు. ఆసక్తి ఉన్నవారు తపాలాశాఖలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 0 నుంచి 150 యూనిట్ల విద్యుత్ పొందాలంటే 1-2 కేడబ్ల్యూ సోలార్ ప్యానల్ ఇంటిపైన ఖాళీ స్థలంలో అమర్చుకోవాలన్నారు. దీనికి రూ. 30వేల నుంచి రూ. 60 వేల సబ్సిడీ ఉంటుందన్నారు. 150 నుంచి 300 యూనిట్ల విద్యుత్తు పొందాలంటే 2-3 కేడబ్ల్యూ సోలార్ ప్యానల్‌ను అమర్చుకుంటే రూ.60 వేల నుంచి రూ.78 వేల సబ్సిడీ పొందవచ్చన్నారు. 300 కంటే ఎక్కువ విద్యుత్ కోసం 3కేడబ్ల్యూ సోలార్ ప్యానల్ అమర్చుకోవాలని సూచించారు. 1కేడబ్ల్యూ సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు రూ.55వేల నుంచి 65వేలు, 2కేడబ్ల్యూ ప్లాంట్ ఏర్పాటుకు రూ.లక్షకు పైగా, 3కేడబ్ల్యూ సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు రూ.1.40 లక్షలకు పైగా ఖర్చు చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు పోస్టాఫీస్‌లో లేదా పోస్ట్ మ్యాన్‌ను సంప్రదించాలని సూచించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిచొద్దు

తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి

రామాయంపేట, ఫిబ్రవరి 27 : రాబోయే పార్లమెంటు ఎన్నికలు ప్రశాంతగా జరగాలని, శాంతి భద్రతలకు విఘాతం కలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం రామాయంపేట పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ నమోదైన వారితో సమావేశమయ్యారు. పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు సహకరించాలన్నారు. ఎన్నికల విధులకు ఆటంకం కలిగిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. శాంతిభద్రతలను కాపాడడానికి పోలీసులకు సహకరించాలని కోరారు. డీఎస్పీ వెంట రామాయంపేట సీఐ వెంకటేశ్, ఎస్సై రంజిత్ ఉన్నారు.

జాతరలు భక్తిభావం పెంపొందిస్తాయి

పాపన్నపేట, ఫిబ్రవరి 27 : జాతరలు ప్రజల్లో భక్తిభావంతోపాటు సమానత్వాన్ని పెంపొందిస్తాయని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. పాపన్నపేట మండలకేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యం లో ఎల్లమ్మ బోనాలు నిర్వహించారు. ఉత్సవాలకు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు హాజరై మాట్లాడారు.

ఆస్తిపన్ను వసూలు చేయాలి

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ఎంఆర్పీఎస్, ప్రజాసంఘాల నాయకులు

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 14 : జిల్లా కేంద్రంలోని కోదండ రామాలయానికి చెందిన దుకాణదారుల నుంచి ఆస్తిపన్ను వసూలు చేయడంతోపాటు దేవాలయ నిధుల ఖర్చుపై తక్షణమే విచారణ జరిపించాలని ఎమార్పీఎస్, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే రోహిత్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. 2004 నుంచి 2024 వరకు మున్సిపల్ ఆస్తి పన్ను వసూలు చేయకుండా ఆక్రమాలకు పాల్పడుతున్న ఆలయ కమిటీపై చర్యలు తీసుకో వా లన్నారు. 23 దుకాణదారుల నుంచి అద్దె వసూలు చేస్తున్న ఆలయ కమిటీ మున్సిపాలిటీకి ఆస్తిపన్ను చెల్లించడం లేదని ఆరోపించారు. పటేల్‌కుంటలోని 67 మున్సిపల్ కాంప్లెక్స్ దు కాణాలకు రెండోసారి నోటిఫికేషన్ ఇవ్వాలని ఎమ్మెల్యేను కోరారు.

సేవలతో ఉద్యోగులకు గుర్తింపు

నార్సింగి మండల పరిషత్ కార్యాలయంలో బదిలీపై వెళ్తున్న ఎంపీడీవో ఆనంద్‌మేరీని సన్మానిస్తున్న ఎంపీపీ సబిత, వైస్ ఎంపీపీ సుజాత, జడ్పీటీసీ కృష్ణారెడ్డి, ఎంపీడీవో చిన్నారెడ్డితోపాటు ప్రజాప్రతినిధులు.

- చేగుంట, ఫిబ్రవరి 27

ఘనంగా సేవాలాల్ మహారాజ్ జయంతి

చిన్నశంకరంపేట మండలకేంద్రంలో మంగళవారం సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు నిర్వహించారు. గిరిజనులు బస్టాండ్ నుంచి భారీర్యాలీ నిర్వహించారు. బోనాలతో గిరిజన మహిళలు నృత్యాలు చేశారు.

-చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 27

నేటినుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం

- మెదక్ జిల్లాలో 30 పరీక్ష కేంద్రాలు
- పరీక్ష రాయనున్న 13,715 మంది విద్యార్థులు

మెదక్ మున్సిపాలిటీ/ చిన్నశంకరంపేట/ వెల్దుర్తి, మార్చి 14 : ఇంటర్మీడియట్ పరీక్షలు నేటినుంచి (బుధవారం) ప్రారంభం కానున్నాయి. బుధవారం ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరుగనున్నది. మెదక్ జిల్లావ్యాప్తంగా 30 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, మొత్తం 13,175 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వీరిలో ప్రథమ సంవత్సర విద్యార్థులు 6,507, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 6,668 మంది ఉన్నారు. ప్రతి పరీక్షా కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారిని నియమించారు. పరీక్షల పర్యవేక్షణకు 1 ఫ్లయింగ్ స్క్వాడ్స్ బృందం, 4 సిట్టింగ్ స్క్వాడ్స్ బృందాలను ఏర్పాటు చేశారు. ఇంటర్ పరీక్షల్లో నిమిషం నిబంధన అమలు చేయనున్నారు. పరీక్ష ప్రారంభమయ్యే సమయానికి ఒక్క నిమిషం ఆలస్యమైనా విద్యార్థులను పరీక్షకు అనుమతించరు.చిన్నశంకరంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ నాగేందర్ మాట్లాడుతూ.. మండలంలో ఇంటర్ మొదటి సంవత్సరం 311 మంది, ద్వితీయ సంవత్సరం 250 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు పేర్కొన్నారు. వెల్దుర్తి మండలకేంద్రంలోని శ్రీరాయరావు సరస్వతీ మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం 117 మంది, ద్వితీయ సంవత్సరం 89 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు.

రామాయంపేటలో...

రామాయంపేట, ఫిబ్రవరి 27 : ఇంటర్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. ఇంటర్ పరీక్షల నిర్వాహణకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. రామాయంపేట పట్టణంలో నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 722 మంది ఇంటర్ మొదటి సంవత్సరం, 683 మంది రెండో సంవత్సరం విద్యార్థులు పరీక్ష రాయనున్న